
సాక్షి సిద్దిపేట

సోమవారం । 9 । జూన్ । 2025



శనిగరం అద్భుతం

శనిగరం ప్రాజెక్టు నేటికీ 134 ఏళ్లయినా చెక్కు చెదరకుండా రైతులకు సాగునీటిని అందిస్తోంది. వివరాలు 8లో ▸



యంత్రం సాగుకే మొగ్గు

కూలీల కొరతను అధిగమించేందుకు కిసాన్ మేళాలో రైతులు సాగు యంత్రాలపై ఆసక్తి చూపుతున్నారు. వివరాలు 8లో ▸



రేషన్.. పరేషాన్

రేషన్ దుకాణాల ఎదుట కార్డుదారులు బారులు తీరుతున్నారు. గంటల తరబడి నిరీక్షిస్తున్నారు. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుదాం



కార్యకర్తలతో ఎంపీ రఘునందన్‌రావు

తొగుట(దుబ్బాక): వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించేందుకు కలిసికట్టుగా కృషి చేద్దామని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. ఆదివారం మండలంలోని పెద్ద మాసాన్‌పల్లి రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో పార్టీ శ్రేణులతో కలిసి పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తాచాటాలని కార్యకర్తలకు సూచించారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు చిక్కుడు చంద్రంతో పాటు నాయకులను ఎంపీ సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నర్సింహులు, బీజేపీ మండల నాయకులు పాల్గొన్నారు.

ముత్యాల పోచమ్మ ఉత్సవాల్లో..

దుబ్బాక: దైవనామస్మరణతోనే సుఖసంతోషాలతో ఉంటామని ఎంపీ మాధవనేని రఘునందన్‌రావు అన్నారు. దుబ్బాక పట్టణంలో బాబు జగ్జీవన్‌రామ్ సంఘం ఆధ్వర్యంలో మూడు రోజులుగా జరుగుతున్న ముత్యాల పోచమ్మ ఉత్సవాల్లో ఆదివారం ఎంపీ పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి దయతో వర్షాలు కురిసి పాడిపంటలు సమృద్ధిగా పండి ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు శ్రీకాంత్‌యాదవ్,సంఘం నాయకులు పాల్గొన్నారు.

జాతీయ యోగా జడ్జిగా సంధ్య



యోగా జడ్జిగా నియామక పత్రం అందుకుంటున్న సంధ్య (ఎడమ నుంచి మూడో మహిళ)

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పంజాబ్‌లో నిర్వహించిన నేషనల్ జడ్జి ట్రెనింగ్‌లో జిల్లా కేంద్రానికి చెందిన తోట సంధ్య పాల్గొని అర్హత సాధించినట్లు యోగాసన భారత్ ప్రధాన కార్యదర్శి జయదీప్ ఆర్య ఆదివారం తెలిపారు. జాతీయ యోగా జడ్జిగా పూర్తి చేసుకున్న తోటసంధ్యను రాష్ట్ర యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీధర్ రావు, ప్రధాన కార్యదర్శి నందనం కృపాకర్, జిల్లా అధ్యక్షుడు తోట అశోక్, ప్రధాన కార్యదర్శి నిమ్మ శ్రీనివాస్ రెడ్డి తదితరులు అభినందనలు తెలిపారు.

డీబీఎఫ్ జిల్లా కార్యదర్శిగా వేణు



గజ్వేల్: పట్టణానికి చెందిన బ్యాగరి వేణు డీబీఎఫ్ (దళిత బహుజన ఫ్రంట్) జిల్లా కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం సిద్దిపేటలో జరిగిన డీబీఎఫ్ మహాసభల్లో వేణు ఎన్నికను ఖరారు చేశారు. తనపై నమ్మకంతో జిల్లా కార్యదర్శిగా ఎన్నుకోవడంపై ఫెడరేషన్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ ఇతర నాయకులకు వేణు కృతజ్ఞతలు తెలిపారు.

మృగశిర మురిపెం

చేపల కొనుగోళ్లతో మార్కెట్లు కిటకిట ● అధిక ధరలకు విక్రయం

దుబ్బాక: జిల్లాలో మృగశిర కార్తె సందడి నెలకొంది. చేపలకు డిమాండ్ పెరిగింది. మృగశిర కార్తె ప్రవేశం రోజున చేపలు తింటే ఏడాదంతా ఆస్తమా ఇతర శ్వాసకోశ వ్యాధులు దరిచేరవని ప్రజల విశ్వాసం. దీంతో ఆదివారం చేపలు కొనేందుకు మార్కెట్లలో ప్రజలు బారులు తీరారు. సిద్దిపేట, దుబ్బాక, గజ్వేల్, హుస్నాబాద్, చేర్యాల, పట్టణాలతో పాటు మండల కేంద్రాలు, గ్రామాల్లో చేపల కొనుగోళ్లతో సందడి కనిపించింది. ప్రజలు ఇష్టపడే కొర్రమీను అంతంత మాత్రమే రావడంతో వచ్చిన కొన్నింటిని ధర ఎక్కువైనా పోటీపడి కొనుగోలు చేశారు. కొర్రమీనులకు రూ.600 నుంచి రూ. 800 వరకు ధర పలికింది. బంగారుతీగలు, రవ్వ, బొచ్చ, గురిజలు, జెల్లలతో పాటు పలు రకాల చేపలను కొన్నారు. మిగతా రోజుల్లో రూ.100 ఉన్న చేపలు మృగశిర సందర్భంగా రూ.200 నుంచి రూ.300 వరకు విక్రయించారు. జిల్లాలో 90 శాతం పైగా చెరువుల్లో నీరు సమృద్ధిగా ఉండడంతో చేపలు పుష్కలంగా పెరిగాయి. అయినా మృగశిర రోజు డిమాండ్ పెరగడంతో అధిక ధరలకు విక్రయించారు.



దుబ్బాక: చేపలు విక్రయిస్తున్న మత్స్యకారులు



భారీ చేపతో యువతి..

కొనుగోలుదారులతో కిక్కిరిసిన సిద్దిపేటలోని చేపల మార్కెట్ (ఫొటోలు: సాక్షి, స్టాఫ్‌ఫొటో గ్రాఫర్)

ప్లాస్టిక్ వ్యర్థాలకు చెక్

గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్యం మెరుగుపరిచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాయి. ఇందుకోసం ప్లాస్టిక్ వ్యర్థాలను పూర్తిగా నిర్మూలించేందుకు వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్లు నెలకొల్పనున్నారు. ఇందులో భాగంగా ఉమ్మడి మెదక్ జిల్లాలో 1,633 గ్రామ పంచాయతీలకు స్వచ్ఛ భారత్ మిషన్– గ్రామీణ్ కింద రూ. 61.28కోట్లు మంజూరయ్యాయి. ఇందులో కేంద్రం 60శాతం, రాష్ట్రం వాటా 40శాతం ఉండనుంది. ఈ నిధులకు వివిధ టార్గెట్లను నిర్ణయించారు. ఆగస్టు చివరి వరకు పూర్తి చేయాలన్న లక్ష్యంతో డీఆర్‌డీఏ అధికారులు ముందుకు సాగుతున్నారు.



పల్లెల్లో రీసైక్లింగ్

– సాక్షి, సిద్దిపేట

- ఉమ్మడి మెదక్ జిల్లాలో 1,633 జీపీలకు రూ.61కోట్లు
- 11 ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్లు మంజూరు
- ఓడీఎఫ్ దిశగా నూతన పంచాయతీలు

పల్లెల్లో తొలిసారిగా ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అందులో భాగంగా ఉమ్మడి మెదక్ జిల్లాకు 11 మంజూరు చేశారు. ఒక్కోదానికి రూ.64లక్షల చొప్పున రూ.7.04కోట్లను కేటాయించారు. రోడ్డు కనెక్టివిటీ, విద్యుత్, నీటి సౌకర్యం ఉన్న ప్రాంతంలో ఈ యూనిట్‌లను ఏర్పాటు చేయనున్నారు. వివిధ ప్రాంతాల నుంచి సేకరించిన ప్లాస్టిక్ వ్యర్థాల నుంచి వివిధ రకాల వస్తువులను తయారు చేయనున్నారు. ప్రాసెస్ చేసిన ప్లాస్టిక్ వ్యర్థాలను రీసైక్లింగ్, రికవరీ ప్రక్రియల ద్వారా వివిధ ఉత్పత్తులను తయారు చేస్తారు. పునర్వినియోగానికి పనికిరాని ప్లాస్టిక్ వ్యర్థాలను దహనం చేయడం కానీ, ల్యాండ్ ఫిల్లింగ్ చేయడం చేయనున్నారు. కాలుష్యంను తగ్గించి పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

19వేల మరుగుదొడ్లు మంజూరు

ఈ ఏడాది గ్రామీణ ప్రాంతాల్లో స్వచ్ఛ భారత్ నిధులతో వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించనున్నారు. ఒక్కో మరుగుదొడ్డి కోసం రూ.12వేల చొప్పున కేటాయించారు. ఉమ్మడి మెదక్ జిల్లాకు 19,806 వ్యక్తిగత మరుగుదొడ్ల కోసం రూ.23.76 కోట్లను మంజూరు చేశారు. పర్యాటక ప్రాంతాలు, పాఠశాలలు, మార్కెట్ స్థలాలు, ఆస్పత్రులు, బస్టాండ్లు అవసరమైన చోట్ల 53 శానిటేషన్ కాంప్లెక్స్‌లను రూ.1.59కోట్లతో నిర్మించనున్నారు.

● కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌లు ఉమ్మడి మెదక్ జిల్లాకు 53 కేటాయించారు. ఒక్కోదానికి రూ.3లక్షల నిధులు మంజూరు చేశారు. ఇందులో నిధులు ఎస్‌బీఎం నుంచి 70శాతం, 15వ ఆర్థిక సంఘం నిధులు 30శాతం మంజూరు చేయనున్నారు.

జిల్లాల వారీగా చేపట్టే పనులు

యూనిట్‌లు	మెదక్	సంగారెడ్డి	సిద్దిపేట	మొత్తం నిధులు
వ్యక్తిగత మరుగుదొడ్లు	1,200	15,606	3,000	రూ. 23.76కోట్లు
ఇంకుడు గుంతలు	5,744	7,390	5,931	రూ. 12.39కోట్లు
సామూహిక ఇంకుడు గుంతలు	898	1,091	876	రూ. 15.70కోట్లు
సెగ్రిగేషన్ షెడ్లు	24	11	15	రూ. 80లక్షలు
మేనేజ్‌మెంట్ ప్లాస్టిక్ వేస్ట్	03	04	04	రూ. 7.04కోట్లు
పారిశుద్ధ్య సమూహాలు	15	19	19	రూ. 1.59కోట్లు



చెత్త సేకరిస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

50 నూతన పంచాయతీల్లో..

ఉమ్మడి మెదక్ జిల్లాలో 1,633 గ్రామ పంచాయతీలలో నూతనంగా 50 గ్రామ పంచాయతీలు ఏర్పాటయ్యాయి. నూతనంగా మెదక్‌లో 24, సంగారెడ్డిలో 11, సిద్దిపేటలో 15 గ్రామ పంచాయతీలను బహిరంగ మలమూత్రవిసర్జన రహిత గ్రామాలుగా తయారు చేయడానికి అధికారులు కార్యాచరణ రూపొందించారు.

“ ప్రతిపాదనలు రూపొందిస్తున్నాం



ఎస్‌బీఎంలో మంజూరైన నిధులకు టార్గెట్‌కు అనుగుణంగా గ్రామాల వారీగా ప్రతిపాదనలు తెప్పిస్తున్నాం. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి పూర్తి స్థాయిలో ఎంపికలు కాగానే వ్యక్తిగత మరుగుదొడ్లు మంజూరు చేస్తాం. ఆగస్టులోగా పనులు పూర్తి అయ్యేలా ముందుకు సాగుతున్నాం. అలాగే కొత్తగా ఏర్పాటైన గ్రామాలను ఓడీఎఫ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందించాం.

–జయదేవ్ ఆర్యా, డీఆర్‌డీఓ, సిద్దిపేట ”

లాభసాటి సాగుపై దృష్టి సారించండి

- నూతన పద్ధతులు అవలంబించాలి
- కలెక్టర్ మనుచౌదరి
- ఫోన్ ద్వారా మంత్రి పొన్నం సందేశం



కలెక్టర్‌ను సన్మానిస్తున్న అధికారులు, రైతులు

హుస్నాబాద్: రైతులు నూతన వ్యవసాయ పద్ధతులు పాటిస్తూ, పంట మార్పిడిలు చేస్తూ లాభాల వైపు పయనించాలని కలెక్టర్ మనుచౌదరి అన్నారు. హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో మూడు రోజుల పాటు జరిగిన రైతు మహోత్సవ ముగింపు సభ ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ ఫోన్ ద్వారా రైతులను ఉద్దేశించి మాట్లాడారు. ముగింపు కార్యక్రమానికి మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో పాటు తాను రావాల్సి ఉండేదని, కేబినెట్ విస్తరణ కారణంగా రాలేకపోయామన్నారు. రైతు మహోత్సవంలో చెప్పిన అంశాలను క్షేత్ర స్థాయిలో పాటించి వ్యవసాయాన్ని అభివృద్ధి చేసుకోవాలని మంత్రి సూచించారు. త్వరలోనే గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తి చేసి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామన్నారు.

పంటల ఉత్పత్తిని పెంచుకోవాలి

రైతు మహోత్సవ కార్యక్రమంలో సిద్దిపేట, కరీంనగర్, హన్మకొండ, జనగామ జిల్లాల నుంచి వచ్చిన రైతులు మూడు రోజుల పాటు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారని కలెక్టర్ మనుచౌదరి తెలిపారు. వ్యవసాయంలో లేటెస్ట్ టెక్నాలజీ, వివిధ మార్పుల గురించి క్లుప్తంగా తెలుసుకున్నారని తెలిపారు. చేపలు, గేదెలు, ఆవులు, కోళ్ళ వ్యర్థాలతో పంటల ఉత్పత్తిని పెంచుకోవాలన్నారు. వ్యర్థాలను రీసైక్లింగ్ చేసి వరి పంటలోకి మళ్లించడం ద్వారా 30 శాతం అధికంగా దిగుబడి పెరుగుతుందన్నారు. అరటి సాగులో మొక్కలను దగ్గర దగ్గర నాటాలన్నారు. మొక్కల కొమ్మలు ఒకటి కొకటి తాకడం వల్ల తేమ బయటకు పోకుండా అందులోనే స్టోరేజి అయి దిగుబడి ఎక్కువగా వస్తుందని తెలిపారు. ఈ పద్ధతి మహారాష్ట్రలోని జలగామ్ జిల్లా రైతులు పాటిస్తూ దేశంలోనే 13 శాతం, ప్రపంచంలోనే 2 శాతం అరటిని ఎగుమతి చేస్తున్నారని తెలిపారు. వాతావరణానికి అనుగుణంగా కొంచెం ఆలోచిస్తే ఎంతో లాభాలు పొందవచ్చని అక్కడి రైతులు నిరూపించారన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక శాఖ, మత్స్యశాఖ, బ్యాంకింగ్, ఇతర ప్రైవేట్ రంగాల నుంచి ప్రతినిధులు భాగస్వామ్యం అయినందుకు అభినందనలు తెలిపారు. అనంతరం కలెక్టర్‌ను వివిధ శాఖల అధికారులు, రైతులు సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, మార్కెట్ కమిటీ చైర్మన్లు, సింగిల్ విండో చైర్మన్లు, వివిధ శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

సర్కారు బడుల్లోనే చేర్పించండి

- విద్యార్థుల అభ్యున్నతే లక్ష్యం
- పాఠశాలల బలోపేతం అందరి బాధ్యత
- డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి

తొగుట(దుబ్బాక): ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బండారుపల్లి మదిర మెట్టు, పెద్ద మాసాన్‌పల్లి గ్రామాల్లో ఆదివారం జరిగిన బడి బాట కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పెద్ద మాసాన్‌పల్లిలో డీఈఓ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. నిష్ణాతులైన ఉపాధ్యాయులచే ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యా బోధన జరుగుతోందన్నారు. విద్యార్థులకు ఆటపాటల్లోనూ శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలపైనే ఉందని అన్నారు. తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి బలోపేతం చేయాలని కోరారు. ప్రైవేట్ మోజులో పడి తల్లిదండ్రులు తమ రెక్కల కష్టాన్ని వృథాచేసుకోవద్దని సూచించారు. స్థానికంగా అందుబాటులో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఇవ్వాలని తల్లిదండ్రులను కోరారు. అంతకు ముందు పాఠశాలల కరపత్రాలను ఆవిష్కరించారు.

మల్లన్నకు పట్నాలు.. భక్తుల మొక్కులు



స్వామి వారి రాజగోపురం ఎదుట భక్తుల సందడి

కొమురవెల్లి మల్లన్న క్షేత్రం ఆదివారం భక్తులతో సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలన్నీ మల్లన్న నామ స్మరణతో మారుమోగాయి. వేకువ జామునుంచే మల్లన్న స్వామిని దర్శించుకునేందుకు బారులుతీరారు. దర్శనం అనంతరం గంగరేణి చెట్టు వద్ద పట్నాలు వేసి, ముడుపులు కట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ఏర్పాట్లను ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు. – కొమురవెల్లి(సిద్దిపేట)

విద్యాధరి, నాచగిరిలో.. భక్తుల కిటకిట

వర్గల్ విద్యాసరస్వతి, నాచగిరి లక్ష్మీనృసింహక్షేత్రాలు ఆదివారం భక్తులతో కిటకిటలాడాయి. సరస్వతిమాత సన్నిధిలో పెద్దసంఖ్యలో చిన్నారుల అక్షరాభ్యాసాలు జరిగాయి. అనంతరం అమ్మవారిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు. మరోవైపు నాచగిరి క్షేత్రంలో స్వాతి నక్షత్ర మహోత్సవ వేడుకలు జరిగాయి. సుదర్శన హోమం నిర్వహించారు. – వర్గల్(గజ్వేల్)



వర్గల్‌లో చిన్నారుల అక్షరాభ్యాసాల సందడి

డొక్కలు చిక్కి .. బొక్కలు తేలి

నాచగిరీశా.. నీ చెంతనే గోవుల గోస

- అల్లాడుతున్న ‘ఆలమంద’
- కాపరికి స్వీపర్ బాధ్యతలు.. గోశాల దాటని ఆవులు
- ఎవరూ పట్టించుకోని దైన్యం



గోశాలలో బక్కచిక్కి, బొక్కలు తేలిన గోవు

వర్గల్(గజ్వేల్): గోమాతలు బక్కచిక్కుతున్నాయి. ఆకలితో అలమటిస్తున్నాయి. సరైన తిండి లేదన్నట్లు బొక్కలు తేలాయి. సంరక్షణకు ప్రత్యేకంగా కాపరి, రూ.10 లక్షల విలువైన చక్కని గోశాల, యేడాదికి దాదాపు రూ. 2 లక్ష విలువైన పశుగ్రాసం, ఎకరాలకొద్ది ఆలయ భూములు, తదితర సంరక్షణ సౌకర్యాలున్న నాచగిరిలో ‘బక్కచిక్కి, డొక్కలు తేలిన ఆవులు’ గోసంరక్షణ తీరును అభాసుపాల్జేస్తున్నాయి. నిర్వహణ లోపాన్ని ఎత్తి చూపుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యాన్ని ప్రశ్నిస్తున్నాయి. రాష్ట్రంలోనే రెండో యాదాద్రిగా నాచగిరి లక్ష్మీనృసింహ క్షేత్రం ప్రసిద్ధిపొందింది. రాష్ట్ర నలుమూలల నుంచి ఇక్కడికి వచ్చే భక్తులు గో పూజ, గోదానం, కోడె మొక్కు ద్వారా స్వామివారికి ఆవులు, కోడెలను సమర్పిస్తుంటారు. ఈ విధంగా నాచగిరి స్వామివారికి సమర్పించిన ఆవులు, కోడెలు, వాటికి పుట్టినవి కలిపి 26 ఉన్నాయి. అందులో 18 ఆవులు, 2 కోడెలు, 6 లేగలున్నాయి.

రూ.10 లక్షలతో విశాలమైన గోశాల

నాచగిరి క్షేత్రంలో ఆలమంద సంరక్షణ, గోపూజకు వీలుగా హైదరాబాద్‌కు చెందిన కందుకూరి వీరేశం అనే దాత రూ.10 లక్షల పైచిలుకు నిధులు వెచ్చించి విశాలమైన గోశాలను నిర్మింపజేశారు. మరోవైపు పశువుల సంరక్షణ బాధ్యతలు నిర్వహించేందుకు నెలకు రూ.32,407 వేతనం పొందుతున్న స్వీపర్‌ను ప్రత్యేకంగా పశువుల కాపరిగా ఆలయ ఈఓ నియమించారు. ఉదయం, సాయంత్రం పశువులను బయటకు మేతకు తీసుకెళ్లాల్సిన బాధ్యత కాపరిదే. పశువులు మాత్రం గోశాల దాటడం లేదు. ఇదేమిటని ప్రశ్నిస్తే తనకు అదనంగా స్వీపర్ బాధ్యతలు కూడా చెబుతున్నారని సదరు పశువుల కాపరి బాల్‌రాజు పేర్కొంటున్నాడు. దీంతో పశువులు గోశాలకే పరిమితమై గ్రాసం కోసం అలమటించడం సాధారణంగా మారింది. అధికారుల పర్యవేక్షణ కూడా కొరవడింది.



నాచగిరి ఆలయం



ఆలయ గోశాలలో బక్కచిక్కిన పశుగణం

భూములున్నా.. పశుగ్రాసం కొనుగోలు

నాచగిరి ఆలయానికి నాచారం, వేలూరు, అనంతగిరిపల్లి, తున్కిఖాల్సా, మీనాజీపేట, అల్లాపూర్, యావాపూర్, రామారం తదితర గ్రామాలలో సాగు భూములున్నాయి. వీటిని లీజు ప్రాతిపదికన రైతులకు ఇచ్చారు. వీటి ద్వారానే కాకుండా, దాతల ద్వారా పశుగ్రాసం పొందే అవకాశముంది. గత సంవత్సరం 2024–25 లెక్కల ప్రకారం 12 నెలల కాలంలో పశువుల కోసం రూ. 2,37,750 పశుగ్రాసాన్ని కొనుగోలు చేశారు. వీటిని సరిగ్గా వినియోగిస్తే పశువులు పరిపుష్టిగా, ఆరోగ్యవంతంగా ఉంటాయని, కానీ ఇందుకు భిన్నంగా బొక్కలు తేలి, బక్కచిక్కి కనపడుతున్నాయని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

“ జాగ్రత్తలు తీసుకుంటున్నాం

నాచగిరి క్షేత్రంలోని గోశాలలో 26 వరకు ఆవులు, కోడెలు, దూడెలున్నాయి. ఆలయ పశుగణం సంరక్షణకు ప్రక్షాళన చర్యలు చేపడుతున్నాం. పశువుల కాపరి కేవలం పశువుల రక్షణకే పరిమితం చేస్తూ ఆదేశించాం. అతనికి ఎలాంటి అదనపు బాధ్యతలు లేవు. నిరంతరం పశు సంరక్షణలోనే ఉండాలని, ఉదయం, సాయంత్రం మేతకోసం తీసుకెళ్లాలని నిర్దేశించాం.

– విజయరామారావు, నాచగిరి ఆలయ కార్యనిర్వహణాధికారి ”